

కరూర్ కన్నీటి సంద్రం



కరూర్ కన్నీటిసంద్రమైంది. నిబంధనల్ని బేఖాతరు చేసి జనానికి చేరువ కావాలన్న తాపత్రయం ఒకవైపు..... పెల్లుబుకిన అభిమాన వర్షం మరోవైపు... వెరసి 38 నిండుప్రాణాలు అనంతలోకాల్లో కలిసిపోవడంతో చిగురుటాకులా వణికిపోయింది.రోదనలు, వేదనలు, ఆక్రందనలతో భీతావహ వాతావరణానికి సాక్షీభూతంగా నిలిచింది.



క్షతగాత్రులను తరలిస్తున్న అంబులెన్స్‌లు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ ప్రచార పర్యటనలో చోటుచేసుకున్న దుర్ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 100మంది వరకు గాయపడగా, ఇందులో 12మంది పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు ప్రకటించారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు, 17 మంది మహిళలు వున్నారు.వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతి శని, ఆదివారాల్లో జిల్లాలవారీగా విజయ్ బస్సుపై ప్రచార పర్యటనలు చేపడుతున్న విషయం తెలిసిందే. సినీ హీరో కావడంతో ప్రజలు ఆయన్ని చూసేందుకు భారీగా తరలివస్తున్నారు. వారిని అదుపుచేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పోలీసులు పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ విజయ్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం కూడా పోలీసు నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నామక్కల్ పర్యటన నుంచే అభిమానుల అత్యుత్సాహం కనిపించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన విజయ్ ప్రచారం.. అభిమానుల తాకిడి కారణంగా మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైంది. అదే విధంగా సాయంత్రం 5 గంటలకు కరూర్‌లో ప్రారంభం కావాల్సిన విజయ్ ప్రచారం.. 7 గంటల తరువాత మొదలైంది. ఆది నుంచే తొక్కిసలాట దోబూచులాడుతుండగా, విజయ్ ప్రచారం ముగిశాక ఇది తారస్థాయికి చేరుకుంది. ప్రచారం జరిగిన ప్రాంతం చిన్నపాటి రోడ్డు కావడం, భారీగా జనం వుండడం తదితరాల కారణంగా జనం ఒకరిపై ఒకరు పడిపోయారు. వారిని అదుపు చేయడం పోలీసులకు అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవ్వరికీ అర్థం కాలేదు. కానీ ఈలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

రాత్రికి రాత్రే స్టాలిన్ పయనం

ఆ ఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్.. వెంటనే స్పందించారు. ఒకవైపు మంత్రులను, అధికారులను అప్రమత్తం చేస్తూనే సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ అందుబాటులో వున్న మంత్రులు, అధికారులతో భేటీ అయిన అనంతరం రాత్రికి రాత్రే ప్రత్యేక విమానంలో కరూర్ బయలుదేరి వెళ్లారు. అదే విధంగా దుబాయ్ పర్యటన కోసం విమానాశ్రయానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి.. దానిని రద్దు చేసుకుని స్టాలిన్‌తో కలిసి కరూర్ బయలుదేరి వెళ్లారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించిన స్టాలిన్.. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తలా రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ. లక్ష ఇస్తామని ప్రకటించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరిన వారి చికిత్సకయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. కాగా మాజీ ముఖ్యమంత్రులు ఎడప్పాడి పళనిస్వామి, ఒ.పన్నీర్‌సెల్వంతో పాటు ఎంపీ కనిమొళి, కేంద్ర మంత్రి అమిత్‌షా, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి, ఏఐసీసీ కార్యదర్శి మల్లికార్జున ఖర్గే, నామ్‌తమిళర్ కట్చి నేత సీమాన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు సైతం ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదిలా వుండగా ఈ ఘటన పట్ల రాష్ట్రప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో విచారణ జరగనున్నట్లు ప్రకటించింది.



క్షతగాత్రుడికి వైద్య సేవలు - యువకుడికి మాజీ మంత్రి సెంథిల్ బాలాజి పరామర్శ - అంబులెన్స్ వద్ద యువకులు

శ్మశానంలా మారిన కరూర్ ప్రభుత్వాసుపత్రి

అంబులెన్సుల్లో వచ్చిన క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శ్మశానంలా తయారైంది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను తీసుకొచ్చారు. క్షతగాత్రులను రక్షించేందుకు వైద్య సిబ్బంది చేసిన ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో 38 మంది మృతి చెందారు. మరో 12మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. మరో 80 మందికి పైగా చికిత్స పొందుతున్నా రు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు. తమ చిన్నారులు కానరావడం లేదంటూ పదిమందికి పైగా తల్లిదండ్రులు రోదిస్తూ రోడ్ల వెంట వెతుకుతూ కనిపించడం పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, మాజీ మంత్రి సెంథిల్ బాలాజి, ఏడీజీపీ దేవాశీర్వాదం తదితరులు ఆస్పత్రి వద్దకెళ్లి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా ఏర్పాట్లను పురమాయించారు. కాగా సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు కరూర్‌తో పాటు నామక్కల్, దిండుగల్, తిరుచ్చి జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఆయా జిల్లాల ప్రభుత్వ యంత్రాంగం సహాయ చర్యలకు దిగింది. ఇతర జిల్లాల నుంచి కూడా వైద్యులను, సిబ్బందిని కరూర్‌కు రప్పిస్తున్నారు.

నా గుండె బద్దలైంది

కరూర్ దుర్ఘటనతో నా గుండె బద్దలైంది. వర్ణించలేని బాధలో మునిగి పోయా. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడ్డ వారు తొందరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

- విజయ్ ట్వీట్



తరమణిలోని ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధన సంస్థలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రైతును కంటికి రెప్పలా కాపాడుతాం

- ఎమ్మెస్ స్వామినాథన్ నివాళి సభలో సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని అన్నదాతలను ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శపథం చేశారు. స్థానిక తరమణిలోని ఎమ్మెస్ స్వామినాథన్ పరిశోధప సంస్థలో శనివారం ఉదయం జరిగిన 'హరిత విప్లవ నాయకుడు' ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ శతవర్ధంతి నివాళి సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఎన్ని తరాలు గడిచినా భారతీయులందరూ మరువలేని, మరచిపోలేని మహోన్నత వ్యక్తి స్వామినాథన్ అని, దేశం వ్యవసాయపరంగా అభివృద్ధి చెందడానికి అంకిత భావంతో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఏ ప్రాంతంలోనైనా వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే పంటలసాగులో కొత్త పద్ధతులు అవలంబించాలన్నారు. రైతులకు కొత్త సాంకేతిక పరికరాలను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు చేసే శాస్త్రవేత్తలకు ఎం.ఎస్ స్వామినాథన్ పేరుతో అవార్డును అందించడానికి తమ ప్రభుత్వం రూ.కోటి మేరకు నిధులు కేటాయించిందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులకు వారి ప్రతిభా పాటవాలను గుర్తించి ఎంఎస్ స్వామినాథన్ పేరుతో అవార్డులను అందిస్తామని తాను ఇదివరకే ప్రకటించినట్లు గుర్తు చేశారు. పోరూరులోని ఎకో పార్కుకు ఎమ్మెస్ స్వామినాథన్ పేరుపెట్టామని ఆయన తెలిపారు. పృథ్విని, ఆ పృథ్విపై జీవాలను కాపాడేందుకు స్వామినాథన్ ట్రస్టు తమ ప్రభుత్వానికి అన్ని విధాలా సహాయసహకారాలు అందించాలని కోరుకుంటున్నామని చెప్పారు. దేశంలో కర్బన వాయు కాలుష్యాన్ని 2070లోగా సంపూర్ణంగా నిరోధించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, తమిళనాట అంతకంటే ముందుగా అంటే 20250లోగా కర్బన వాయుకాలుష్యాన్ని నిరోధించేలా తగు చర్యలను ప్రారంభించిందని చెప్పారు. ఎంఎస్ స్వామినాథన్‌ను స్ఫూర్తిగా తీసుకుని తమ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని రైతులను కంటికి రెప్పలా కాపాడుతుందని స్టాలిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, రాజకన్నప్పన్, దామో అన్బరసన్, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పరిశోధన సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ సౌమ్యా స్వామినాథన్, పోస్టుమాస్టర్ జనరల్ మరియమ్మా థామస్, సీనియర్ ఐఏఎస్ అధికారులు గగన్‌దీప్‌సింగ్ బేదీ, జయశ్రీ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత మెజార్టీతోనే అధికారంలోకి

- కుళిత్తలై రోడ్‌షోలో అన్నాడీఎంకే చీఫ్ ఈపీఎస్



మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సొంత మెజార్టీతో గెలిచి అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో గత జూలై 7న ఈపీఎస్ ప్రారంభించిన ప్రచారయాత్ర శనివారం కరూర్ కుళిత్తలై నియోజకవర్గానికి చేరుకుంది. ఇక్కడ నిర్వహించిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ... రాష్ట్ర అసెంబ్లీలోని 234 నియోజకవర్గాల్లో అన్నాడీఎంకేకు చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉందని, 2026 ఎన్నికల్లో సుమారు 210 నియోజకవర్గాలను తాము కైవసం చేసుకుని సొంత మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్రప్రజలు గత జూలైలో తాను పాల్గొన్న మొదటి ప్రచార యాత్ర సమయంలోనే నిర్ణయించారన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి స్టాలిన్, రాష్ట్రమంత్రులు, ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీస్థాయిలో ప్రజాధనాన్ని దోచుకున్నారని, అందువల్ల ఈడీ ఎప్పుడు తలుపులు తడుతుందో అని ఆందోళన అధికారపార్టీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కరూర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా ప్రజలు భారీస్థాయిలో తరలివచ్చి తనకు మద్దతు తెలపడం తమకు దక్కిన విజయంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. కరూర్ జిల్లా అన్నాడీఎంకే కంచుకోటగా మారుతుందని, డీఎంకే మాజీమంత్రి సెంథిల్ బాలాజి కల ఎప్పటికీ ఫలించబోదన్నారు. ఐదు పార్టీలు మారిన ఆయన అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు అధికారపార్టీలోనే ఉంటారని, ఫలితాల అనంతరం మరో పార్టీ కండువా తప్పకుండా కప్పుకుంటారని ఈపీఎస్ ఎద్దేవా చేశారు. తమిళులు పెద్దపండుగగా జరుపుకునే పొంగల్‌కు కానుకగా రూ.2,500, సరుకులను పంపిణీ చేశామని, మళ్లీ ఆ రోజులు రావాలని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిన అన్నాడీఎంకే పథకాలు అన్నింటినీ మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఉపాధి వెతుక్కుంటూ ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి తరలివచ్చి మరమ్మగ్గాలు, ఇటుక బట్టీలు, క్వారీలు, భవన నిర్మాణం పనుల్లో పనిచేస్తున్న వలస కార్మికులే లక్ష్యంగా డీఎంకే మోడల్ ప్రభుత్వంలో అధికారవర్గానికి చెందిన ఆస్పత్రి నిర్వాహకులు కిడ్నీల చోరీకి పాల్పడుతున్నారన్నారు. అయినా దీనిపై సీఎం స్టాలిన్ స్పందించకపోవడం దారుణమన్నారు. సామాన్య ప్రజలు తమ హక్కుల కోసం, ప్రభుత్వ ఉద్యోగులు వారి దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ప్రతిరోజు పలు ప్రాంతంలో ధర్నాలు చేస్తున్నారని, సంబంధిత అధికారులు వారిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాజకీయాల్లో అనుభవం లేకపోవడం వల్లే నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, జయలలితలను కించపరిచేలా వ్యాఖ్యానించారని, ఇది ఖండించదగ్గదన్నారు. విదేశాలకు వెళ్లి రాష్ట్రానికి సమీకరించిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయకుండా సీఎం స్టాలిన్ నాటకమాడుతున్నారని ఈపీఎస్ ధ్వజమెత్తారు.

డీఎంకేతోనే తలపడుతున్నాం

- ఆ పార్టీలాగా బీజేపీతో రహస్య పొత్తు పెట్టుకోం
- అమలుకు వీలుకాని హామీలతో జనాన్ని మోసపుచ్చం
- టీవీకే అధినేత విజయ్ ధ్వజం
- అట్టహాసంగా నామక్కల్ రోడ్‌షో



ప్రసంగిస్తున్న విజయ్ - విజయ్ ప్రచార వాహనం వద్ద భారీగా గుమిగూడిన జనసందోహం

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ప్రధానంగా డీఎంకేతోనే తమపార్టీ తలపడనుందని, ఆ పార్టీలాగా తాము బీజేపీతో రహస్యంగా పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ నటుడు విజయ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం నామక్కల్‌లో రోడ్‌షోలో ప్రసంగిస్తూ... ఆచరణకు సాధ్యమయ్యే హామీలనే ప్రకటిస్తామన్నారు. ఇక లారీల బాడీలు కట్టడంలోను, కోడిగుడ్లను అందించటంలో నామక్కల్ ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ సీమలోనే ప్రముఖ కవి నామక్కల్ కవింజర్ రామలింగం పిళ్లై జన్మించారని, తమిళ ప్రజలకు రిజర్వేషన్లు అమలు చేయాలని మొదటిసారిగా పిలుపునిచ్చింది ఈ జిల్లాకు చెందిన తిరుచెంగోడు సుబ్బరాయన్ అని అన్నారు. తిరుచెంగోడు సుబ్బరాయన్‌కు స్మారక మండపం నిర్మిస్తామంటూ డీఎంకే హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా అది నెరవేరలేదన్నారు. ఓ తమిళ చిత్రంలో హాస్యనటుడు వడివేల్ తన ఖాళీ జేబులు చూపించి తన వద్ద ఏమీలేదని చెబుతాడని, ఆ రీతిలోనే డీఎంకే నేతల్ని ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తే తాము చేసిందేమీ లేదంటూ ఖాళీ జేబులు చూసి మురిసిపోవాల్సిందేనని విజయ్ విమర్శించారు. ప్రతి యూనియన్‌లోనే ధాన్యం గిడ్డంగులు ఏర్పాటు చేస్తామని, కొబ్బరిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రేషన్‌షాపుల్లో తాటిబెల్లం, బెల్లం విక్రయిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకే కాదు రవాణా కార్మికులకు కూడా పాత పింఛన్ పథకాన్ని అమలు చేస్తామని వరుసగా ప్రకటించిన హామీలను డీఎంకే ప్రభుత్వం నెరవేర్చ లేదన్నారు.

డీఎంకే ఎమ్మెల్యే ఆస్పత్రిలో కిడ్నీ చోరీలా?

డీఎంకే శాసనసభ్యుడు నడుపుతున్న ప్రైవేటు ఆస్పత్రిలో కిడ్నీ చోరీ లు ముమ్మరంగా జరిగాయని, అత్యధికంగా నష్టపోయింది నామక్కల్‌లోని పవర్‌లూమ్ కార్మికులేనని విజయ్ చెప్పుకొచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కిడ్నీల దొంగలను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కిడ్నీల చోరీకి ప్రధాన కారణం ఏమై ఉంటుందా అని పరిశీలించినపుడు కార్మికులు, పేదలు కందువడ్డీలకు తీసుకున్న అప్పులే కారణమని, ఆ అప్పులిచ్చింది కూడా డీఎంకే నేతలేనని విషయం తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానన్నారు. తాను పర్యటించిన ప్రతి చోటా ప్రజలు తాగునీటి సదుపాయం, రహదారులు, వైద్యం అంటూ కనీస సదుపాయాలు కల్పించాలనే తనకు చెబుతున్నారని, వీరిందరికీ డీఎంకే నేతల్లా అబద్ధపు హామీలు ఇవ్వబోమన్నారు. ప్రచార సభలలో కొత్తగా ఏవైనా చెప్పమంటూ రాజకీయ ప్రత్యర్థులు అదే పనిగా ప్రశ్నిస్తున్నారని, వారికంటే గొప్పగా తాను కూడా అంగారక గ్రహంలో ఐటీ కంపెనీ, గాలిలో మేడలు, అమెరికాకు కాలినడక దారి ఏర్పాటు చేస్తానని, ఇంటి నుంచే విమానాలు నడుపుతామని కల్లబొల్లి కబుర్లు చెప్పగలనని విజయ్ ఎద్దేవా చేశారు. తాను ప్రతి సభలోనూ చెప్పినట్లే బీజేపీతో ఎన్నటికీ పొత్తు పెట్టుకోబోమని, డీఎంకేలా ఆ పార్టీతో రహస్య పొత్తుపెట్టుకోవాల్సిన అవసరం కూడా తమకు లేదని స్పష్టం చేశారు.

ఆ ఓటు బీజేపీకి పడినట్లే...

మా అమ్మే (జయలలితే) దైవం అంటూ ఆరాధించిన పార్టీ నేతలంతా (అన్నాడీఎంకే నేతలంతా) ఆమె ఆశయాలకు విరుద్ధంగా బీజేపీతో పొత్తుపెట్టుకున్నారని, తమిళుల సంక్షేమం కోసమే పొత్తు పెట్టుకున్నట్లు గొప్పలు చెప్పుకోవడం గర్హనీయమన్నారు. ఎంజీఆర్ అభిమానులు, పార్టీ శ్రేణులంతా బీజేపీతో ఎందుకు పొత్తు కుదుర్చుకున్నారంటూ ఆ పార్టీ నేతలనే ప్రశ్నిస్తున్నారని చెప్పారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తు అందరికీ తెలిసిన విషయమేనని, ఆ పొత్తుపై జనానికి నమ్మకం లేదని కూడా తేలిపోయిందన్నారు. అదే సమయంలో డీఎంకే కుటుంబ సభ్యులంతా బీజేపీకి రహస్య బంధువులనే విషయాన్ని ప్రజలు ఎన్నటికీ మరువకూడద న్నారు. డీఎంకేకు ఓటేస్తే బీజేపీ ఓటేసినట్లేనని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న డీఎంకేతోనే టీవీకే తలపడుతోందనే విషయాన్ని ప్రజలు గమనించి ఆచితూచి వ్యహరించి తన పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రతిచోటా ఆలస్యమే...

టీవీకే నేత విజయ్ శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న రోడ్‌షోల అన్నీ ఆలస్యంగానే ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10గంటలకు నిర్దేశిత ప్రాంతంలో ప్రచార వాహనం నుంచి ప్రసంగించాలన్న పోలీసుల నిబంధనల ప్రకారం ఈ రోడ్‌షోలు జరగడం లేదు. నామక్కల్‌లో ఉదయం 10.30 గంటలకు విజయ్ ప్రసంగించాల్సి ఉండగా మధ్యాహ్నం రెండు గంటలకు ఆయన ప్రచార వాహనం నిర్దేశిత ప్రాంతానికి చేరింది. దీనితో ఆయన పావుగంటపాటే ప్రసంగించాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్కడి నుండి కరూరుకు బయలుదేరారు. నామక్కల్‌లో విజయ్‌ని ఆహ్వానించేందుకు వేలాదిమంది అభిమానులు, కార్యకర్తలు శనివారం వేకువజాము 7 గంటల నుంచే రహదారికి ఇరువైపులా బారులు తీరారు.

సమాచార దర్శిని

నేడు 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాసం

అడయార్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఆదివారం 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారా వాహిక కార్యక్రమం జరగనుంది. స్థానిక టి.నగర్ విజయరాఘవ రోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు 'మహా కవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం' అంశంపై చెన్నైలోని వివేకానంద కళాశాల సంస్కృత శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కళ్ళే ప్రశాంత్ ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

30న రాజరాజేశ్వరి దేవి శరన్నవరాత్రుల దైవారాధన

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్ టౌన్ కలపాచారి వీధిలో ఉన్న ఆయిర వైశ్యర్ తెలుగు భేరి వైశ్యసభ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ మంగళవారం శ్రీ రాజరాజేశ్వరి దేవి శరన్నవరాత్రుల దైవారాధన జరగనుంది. శ్రీఅన్నాడిశెట్టి అంకమ్మరత్నంశెట్టి సదరన్‌భవనంలో అశ్వయుజమాస శుద్ధ అష్టమి తిథి శుభ లగ్నంలో ఉదయం 9.30 గంటలకు దుర్గాదేవి ప్రతిష్ఠ, కలశస్థాపన, సంకల్పం, దుర్గాదేవి హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు 108 మంది ముత్తైదువులచే సుమంగళి, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐదు సరుకులతో దీపావళి గిఫ్ట్ ప్యాక్

● పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటన

పుదుచ్చేరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా రేషన్ కార్డుదారులకు ఐదు సరుకులతో ఉచిత గిఫ్ట్ ప్యాక్ అందిస్తామని పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించింది. గిఫ్ట్ ప్యాక్‌లో 2 కిలోల చక్కెర, 2 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, కిలో శనగపప్పు, అర కిలో రవ్వ, 500 గ్రాముల మైదా ఉంటాయని తెలిపింది. పుదుచ్చేరిలోని 2,62,313 రేషన్ కార్డులు, కారైక్కాల్‌లో 60,221, మాహేలో 7,980, యానాంలో 15,460 రేషన్ కార్డులకు ఈ ఉచిత గిఫ్ట్ ప్యాక్ అందించనున్నారు.

నేడు టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షలు

టి.నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న 645 పోస్టులకు గ్రూప్-2, గ్రూపు-2ఏ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం జరుగనున్నాయి. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, ప్రొబేషన్ ఆఫీసర్, సబ్‌రిజిస్ట్రార్ లెవల్ -2, స్పెషల్ డివిజన్ అసిస్టెంట్, అసిస్టెండ్ డివిజన్ ఆఫీసర్, ఫారెస్టర్ సహా 50 పోస్టులు, గ్రూప్-2 పోస్టులైన సీనియర్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఆడిట్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్, అసిస్టెంట్ లెవల్-3, అసిస్టెంట్, సీనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లెవల్-3, లోయర్ లెవల్ ఎగ్జిక్యూటివ్ క్లర్క్ పోస్టులు సహా 595 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు టీఎన్‌పీఎస్సీ జూలై 15న ప్రకటించింది. ఈ పోస్టులకు 2,12,495 మంది పురుషులు, 3,41,114 మంది మహిళలు, 25 మంది హిజ్రాలు దరఖాస్తులు సమర్పించారు. వీరికి ఇటీవల హాల్ టికెట్లు జారీ చేశారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1905 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగనున్నారు. నగరంలో 188 కేంద్రాల్లో 53,606 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చునుకోవాలని ఆ తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని అధికారులు తెలిపారు.ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైనవారు మెయిన్ పరీక్షలు రాయాలని పేర్కొన్నారు.

విజయదశమి రోజున విద్యార్థులను చేర్చుకోండి

● పాఠశాలలకు ప్రభుత్వ ఉత్తర్వులు

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): విజయదశమి రోజున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవాల్సిందిగా విద్యాశాఖ అధికారులకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలను పాఠశాల పనిరోజుల్లోనే పంపిణీ చేయాలని సెలవు రోజుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రాథమిక, మాధ్యమిక, మహోన్నత పాఠశాలల్లో విజయదశమి రోజైన అక్టోబర్ 2 నుంచి అడ్మిషన్ ప్రక్రియలు చేపట్టాలని, చేరిన విద్యార్థుల వివరాలను 'ఎమిష్' వెబ్‌సైట్‌లో, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలని ప్రభుత్వం తెలిపింది.

డిసెంబర్ 21న ఎస్ఐ పోస్టులకు రాతపరీక్ష

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపోలీసు శాఖలో ఎస్ఐ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న సుమారు 3లక్షల మందికి పైగా అభ్యర్థులకు డిసెంబర్ 21న రాతపరీక్షలు జరగనుంది. పోలీసుశాఖలో 1,299 మంది ఎస్ఐలను ఎంపిక చేయనున్నట్లు యూనిఫాం ఉద్యోగుల పరీక్షల బోర్డ్ గత ఏప్రిల్ 4న ప్రకటించింది. ఈ నెల 7వ తేదీనుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఎస్ఐ పోస్టులకు సంబంధించిన రాతపరీక్ష కోసం రాష్ట్రంలో 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా పోలీసులకు, జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీఅయ్యాయి.

2న శిరిడి సాయిబాబా 107వ మహాసమాధి దినోత్సవం

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్పాడి మహాకవి భారతినగర్ 17వ ఈస్ట్‌క్రాస్ వీధిలోని వ్యాసై శిరిడి సాయిబాబా ఆలయంలో సాయినాథుని 107వ మహాసమాధి దినోత్సవం, విజయదశమి వేడుకలు నిర్వహించనున్నారు. వచ్చే అక్టోబర్ 2వ తేదీ ఉదయం 8 గంటలకు హారతి, అన్నప్రసాదం, 10.00 నుంచి 11.30 గంటల వరకు బాబాకు ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సాయి ఎం.చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం నివాసానికి ఏఐ భద్రత

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాస గృహానికి ఏఐ ఆధారిత భద్రతా ఏర్పాట్లు కల్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రికి భద్రత కల్పించేందుకు పోలీసు శాఖలో ప్రత్యేకంగా 'కేర్ సెల్' పని చేస్తోంది. ఈ నేపథ్యంలో స్టాలిన్ నివాసం చుట్టూ ఉన్న ప్రధాన రహదారుల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో సీసీ కెమెరాలు, ఫేస్ రీడింగ్ కెమెరాలు, ఏఎన్‌పీఆర్ కెమెరాలు సహా 110 సీసీ కెమెరాలను 29 ప్రాంతాల వద్ద ఏర్పాటు చేయనున్నారు.

వైభవంగా పురటాసి రెండో శనివారం వేడుకలు

● శ్రీవారికి ప్రత్యేక పూజలు





ఆంజనేయనగర్ వేడుకల్లో సీనియర్ న్యాయవాదులు మోహనకృష్ణ, కే.బీ.కమల్ - ఓటేరి చెల్లప్పమొదలి వీధిలో తిరుమల ఆలయ నమూనాతో భారీ సెట్టింగ్

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల గిరుల్లో కొలువుదీరి భక్తులను కటాక్షిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వరస్వామి వారికి ప్రీతికరమైన పురటాసి మాసం రెండో శనివారం సందర్భంగా చెన్నైలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, భజన లు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని కొలువుదీర్చిన ప్రాంగణాలు గోవిందనామస్మరణతో మారుమోగాయి. టి.నగర్‌లో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయం. ట్రిప్లికేన్‌లో ప్రసిద్ధి చెందిన పార్థసారథిస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు.

ఆంజనేయనగర్‌లో... : రాయపురం నియోజకవర్గం ఆంజనేయనగర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ అరుంధతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కే.బీ.కమల్ నేతృత్వంలో పురటాసి వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా తిరుమల పాదయాత్ర భక్తులు, పేదలకు మద్రాస్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మోహనకృష్ణ, కర్రా బాలసుందరం తదితరులు అన్నదానం చేశారు.

ఓటేరిలో... : ఓటేరి చెల్లప్పమొదలివీధిలో వేంకటేశ్వరపెరుమాళ్ భక్త బృందం ఆధ్వర్యంలో 33వ వార్షిక పురటాసి ఉత్సవాలను హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు ప్రారంభించారు. తిరుమల ఆలయ నమూనాతో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. సుమారు 2వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు.

గరుడ వాహనంపై శ్రీనివాసపెరుమాళ్ చిద్విలాసం



గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసపెరుమాళ్

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కంలో పురాతన శ్రీనివాసపెరుమాళ్ దేవస్థానం పురటాసి వైభవంలో రెండో శనివారం గరుడవాహన సేవను ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం, అర్చన, మహాదీపారాధన, ప్రత్యేక అలంకారాలను నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్త ఎన్.గంగాధరన్ నేతృత్వంలో ఉదయం 9గంటలకు ఉభయ దేవేరుల సమేతుడైన శ్రీవారికి పాలు, తేనె, పన్నీరు, నారికేళ జలం, పెరుగు, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు, 11 రకాల పుష్పాలతో విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్ని సన్నిధులను అరటి, మామిడి, పూల తోరణాలతో అలంకరించారు. హారతి అనంతరం వేదమంత్రోచ్చారణ, మేళతాళాలు, గోవిందనామస్మరణల మధ్య గరుడవాహనంపై శ్రీనివాస పెరుమాళ్ ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పురుషవాక్కంలో వెళ్లాలర్‌వీధి, ముత్యాలచెట్టివీధి, ఆదియప్పవీధి, సుబ్రమణ్యమొదలివీధి, శరవణపెరుమాళ్ వీధుల్లో ఊరేగించగా, భక్తులు స్వామివారికి టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా మెగా అన్నదానం జరిగింది.

తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ఐడీ కార్డు టాగ్‌తో

విజయ్‌తో భేటీకి ప్రయత్నించిన వ్యక్తి నిర్బంధం



తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో సీఐఎస్‌ఎఫ్ అధికారులతో గొడవపడుతున్న ఆగంతకుడు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో గుర్తింపు కార్డులేని టాగ్‌ను మాత్రమే మెడలో వేసుకుని టీవీకే అధినేత విజయ్‌తో భేటీ అయ్యేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు నిర్బంధించారు. నామక్కల్, కరూరులో ప్రచారానికి చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన విజయ్.. తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్నారు. తిరుచ్చి విమానాశ్రయం వద్ద టీవీకే కార్యకర్తలెవరినీ అనుమతించకుండా పోలీసులు ఆయనకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థకు చెందిన గుర్తింపు కార్డు టాగ్‌ను మెడలో ధరించి విమానాశ్రయం లోపల ఉన్న విజయ్‌ని కలుసుకునేందుకు వేగంగా వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే భద్రతా విధులు నిర్వహిస్తున్న కేంద్ర పారిశ్రామిక దళం అతడిని అడ్డుకుంది. తాను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఉద్యోగినని, తన మెడలో ఉన్న ట్యాగ్‌ను చూడమంటూ బెదిరించాడు. వెంటనే అధికారులు అతడి మెడలో ఉన్న ట్యాగ్‌ను పరిశీలించినప్పుడు దాని కొసన ఫొటో గుర్తింపు కార్డు కనిపించలేదు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ట్యాగ్‌ను మాత్రమే ధరించి తమను మోసగించేందుకు ప్రయత్నించాడంటూ అధికారులు ఆ వ్యక్తిని నిర్బంధించి విమానాశ్రయం పోలీసులకు అప్పగించారు.

ఆక్సిమెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఆక్సిమెడ్ హాస్పిటల్ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆక్సిమెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వాకథాన్ నిర్వహించారు. హృద్రోగ సమస్యలపై అవగాహన కల్పించేలా ధూమపానానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం (టీఎంఎంకే) సహకారంతో జరిగిన ఈ వాకథాన్‌లో న్యూ కాలేజీ, అంజుమన్ హిమయదుల్ ఇస్లామ్ ఇనిస్టిట్యూట్, జస్టిస్ బషీర్ అహమ్మద్ సయీద్ (జేబీఏఎస్) మహిళా కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆక్సిమెడ్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆయజ్ అక్బర్, 174వ వార్డు కౌన్సిలర్ రాధిక, చెన్నై సౌత్ డిస్ట్రిక్ట్ యూత్ వింగ్ డిప్యూటీ ఆర్గనైజర్ వినాయకమూర్తి, జేబీఏఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంతుల్ అజీజ్, టీఎంఎంకే వైద్య విభాగం కార్యదర్శి ఎ.ఖలీల్ రెహ్మాన్, నటి సుభాషిణి బాలసుబ్రమణ్యం, కళాకారిణి నికిత సంఘ్వి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఎన్నికల పనులు చేపట్టండి

● కాంగ్రెస్ ఎంపీలకు స్టాలిన్ హితవు



సీఎంతో చర్చిస్తున్న కాంగ్రెస్ ఎంపీలు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ఇప్పటి నుంచే ప్రచార పనులు చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీలకు డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిశా నిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికసీట్ల కోసం డీఎంకేపై ఒత్తిడి చేయాలని, ఎన్నికల తర్వాత అధికారంలో భాగస్వామ్యం కోరాలని కాంగ్రెస్ సీనియర్ నేతలంతా రోజుకో ప్రకటన జారీ చేస్తున్న నేపథ్యంలో స్టాలిన్ పిలుపుమేరకు ఆ పార్టీ ఎంపీల సమావేశం శనివారం ఉదయం జరిగింది. అన్నా అరివాలయంలో ఏర్పాటైన ఈ సమావేశంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పాల్గొన్నారు. అరివాలయానికి వెళ్లడానికి ముందుగా కాంగ్రెస్ ఎంపీలు సత్యమూర్తి భవన్‌లో భేటీ అయి స్టాలిన్‌తో ఏయే అంశాలపై చర్చించాలన్న విషయమై సమాలోచనలు చేశారు. ముఖ్యంగా అధికారంలో భాగస్వామ్యం కోరాలని పలువురు ఎంపీలు తెలిపారు. ఈ భేటీ అనంతరం అందరూ అన్నా అరివాలయం చేరుకున్నారు. ఎంపీలు విజయ్‌వసంత్ (కన్నియాకుమారి), రాబర్ట్ పురుష్ (తిరునల్వేలి), విష్ణుప్రసాద్ (కడలూరు), జ్యోతిమణి (కరూరు), గోపీనాథ్ (కృష్ణగిరి), సుధా (మైలాడుదురై) పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీల గైర్హాజరు...

డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కార్తీ చిదంబరం (శివగంగ), మాణిక్కం ఠాకూర్ (విరుదునగర్), శశికాంత్ సెంథిల్ (తిరువళ్లూరు) గైర్హాజరయ్యారు. ఈ ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు సుదూర ప్రాంతాల్లో ఉండటం వల్ల హాజరుకాలేకపోయారని టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై తెలిపారు.

ఆచితూచి...

ఈ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. కూటమిలో ఉన్న పార్టీలకు, కొత్తగా కూటమిలో చేరనున్న పార్టీలకు సీట్ల కేటాయించడంపై ఆచితూచి వ్యవహరించాల్సి ఉందన్నారు. కూటమిలో మొదటి స్థానంలో ఉన్న కాంగ్రెస్‌కు ఆశినంత సీట్లను ఇవ్వలేకపోయినా ఆ పార్టీ సంతృప్తి చెందేలా సీట్ల కేటాయింపులు జరుగుతాయని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం డీఎంకే ఎంపీలకు తెలిపినట్లే పార్లమెంట్ సమావేశాలు జరగని రోజుల్లో వారానికి నాలుగు రోజులు కాంగ్రెస్ ఎంపీలు కూడా నియోజకవర్గాల్లోనే బసచేసి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల బరిలో కొత్త పార్టీలు కూడా దిగుతుండటంతో ఈ సారి ప్రచారం మరింత పటిష్ఠంగా, ప్రజలను ఆకట్టుకునే రీతిలోనూ సాగించాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. తమ నియోజకవర్గాలలో అర్హులైన అభ్యర్థులెవరైనా ఉంటే ఆ వివరాలను తనకు పంపించాలని స్టాలిన్ కోరారు.


గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కే.జీ.కండిగలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసోసియేషన్ తరుపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు చదువు పూర్తయిన అనంతరం ఉన్నతస్థాయికి ఎదుగుతున్నారంటే దానికి ఉపాధ్యాయులే కారణమన్నారు. అలాంటి ఉత్తమ టీచర్ల రుణం తీర్చలేనిదన్నారు. అనంతరం ప్లస్‌వన్, ప్లస్‌టూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి మోహన్, అమృత, రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, డీఎంకే జిల్లా కోశాధికారి హరిబాబు, డీఎంకే జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్తుబిళ్లల విక్రేతల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలో మత్తుబిళ్లలు విక్రయిస్తున్న 14 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వేలూరు పరిసర ప్రాంతాల్లోని కళాశాల విద్యార్థులకు మత్తుబిళ్లలు, గంజాయి తదితర మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన ఫిర్యాదులతో ఆ ప్రాంతాల్లో నిఘాను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి కాట్పాడిలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొంతమంది యువకులను తనిఖీ చేశారు. మత్తుబిళ్లలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా మరికొంతమంది యువకుల పేర్లు తెలిపారు. వారిని కూడా పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు రాణిపేట జిల్లాకు చెందిన అండవర్, శరత్‌కుమార్, త్రివిక్రమ్, ఈశ్వర్, యోగమణినాథన్, శేషు, కుమార్, లోకేష్, శరవణన్, శ్రీధర్, సెల్వన్, వినాయగన్, తమిళరసన్, సంజయ్‌కుమార్‌గా పోలీసులు గుర్తించారు. కాగా నిందితులందరూ 24 ఏళ్లలోపు వారు కావడం గమనార్హం. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రామేశ్వరం, పాంబన్‌లో పెనుగాలులు

● ఇళ్లకే పరిమితమైన జాలర్లు



పాంబన్ తీరం వద్ద లంగరేసి నిలిపి ఉంచిన పడవలు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పవాయుపీడనం కారణంగా రామేశ్వరం, పాంబన్ తీరాల్లో పెనుగాలులు వీస్తుండటంతో స్థానిక అధికారుల హెచ్చరికలతో శనివారం ఉదయం చేపలవేటను జాలర్లు మానుకున్నారు. అదే సమయంలో పాంబన్ రేవులో 1వ నెంబర్ తుఫాను హెచ్చరిక సూచికను ఎగురవేశారు. రామేశ్వరం తీరం పొడవునా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయడంతో పాటు అలలు కూడా మూడు నుంచి ఐదు మీటర్ల ఎత్తున ఎగసి పడుతున్నాయి. ఈ కారణంగా రామనాథపురం జిల్లావ్యాప్తంగా జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా ఇంటిపట్టునే గడిపారు. ధనుష్కోడి, ఏర్వాడి, తొండి ప్రాంతాలకు చెందిన జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తిరుత్తణి, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో తాత్కాలిక ఉద్యోగిని హతమార్చిన కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు యూనియన్ పరిధిలోని నర్తవాడ పంచాయతీలో నివసిస్తున్న జగన్ (36)కు అదే ప్రాంతంలో విద్యుత్‌శాఖ తాత్కాలిక ఉద్యోగి సుధాకర్ (30)కు విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, గురువారం రాత్రి సుధాకర్ ఇంటికి జగన్ వెళ్లి గొడవచేయడంతో వారి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. దీంతో జగన్, సుధాకర్ తలపై ఇనుపరాడ్డుతో బలంగా కొట్టగా తీవ్ర రక్తస్రావంతో సుధాకర్ తన ద్విచక్ర వాహనంపై తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఇంతలో వెనుకనే వెంబడిస్తూ వచ్చిన జగన్ సుధాకర్‌ను హతమార్చి ఆపై మృతదేహాన్ని బైక్‌పై పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేవలం 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

● డ్రైవర్‌కు గాయాలు



టిప్పర్‌ను బయటికి తీస్తున్న దృశ్యం

తిరుత్తణి, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుండి తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని తచ్చూరు రహదారి మీదుగా వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనింది. పళ్లిపట్టులోని ఎడికపేటలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో క్వారీ ఉంది. ఈ క్వారీ నుంచి లోడుతో వెళ్లే టిప్పర్ వాహనాల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ కొన్ని రోజులుగా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం క్వారీ నుంచి అధికలోడుతో వేగంగా వస్తున్న టిప్పర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, ఇది గమనించిన స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు పంచాయతీ అధికారులతో కలిసి ప్రమాదానికి గురైన టిప్పర్‌ను కాలువ నుండి వెలుపలికి తీసి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం 'పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం' ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు కార్పొరేషన్ కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. రోడ్లపై మురుగు, చెత్త తదితరాలు నిల్వ ఉంటే అనారోగ్యం పాలవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఆర్గనైజర్ జనార్దనన్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు థామస్, సభ్యులు మహేంద్రన్, బాలాజి, రూపన్, పాఠశాల నిర్వాహకులు సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ పెట్టాలి



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ పెట్టాలని శ్రీగీతా భవన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్ పేర్కొన్నారు. శ్రీ గీతాభవన్ ట్రస్ట్, ఆరోగ్య భారతి తమిళనాడు, కంచి కామకోటి చైల్డ్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 'సేవా తరంగిణి' పేరుతో విమెన్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. స్థానిక గోపాలపురం, అవ్వైషణ్ముగం రోడ్డులో ఉన్న శ్రీ గీతా భవన్ హాలు వేదికగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్, ట్రస్టీ కే.కే.గుప్తా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగిన ఈ శిబిరంలో మహిళలు, చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా మనుగోయల్ మాట్లాడుతూ.. శ్రీ గీతా భవన్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు దివ్యాంగులకు సామూహిక వివాహాలు జరుపుతున్నట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం చికిత్సలు చేయించుకున్న వారికి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారతి తమిళనాడు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరిహరన్, కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ ఉషా విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అబార్షన్ పరికరాల విక్రయం

● నకిలీ డిస్ట్రిబ్యూటర్ అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సేలం, తేని జిల్లాలో చట్టవిరుద్ధంగా అబార్షన్ పరికరాలను విక్రయించిన నకిలీ మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతని నుంచి 6,720 పరికాలను స్వాధీనం చేసుకున్నారు. 1971 నుంచి కొన్ని నిబంధనలతో గుర్తింపు పొందిన కొన్ని ఆస్పత్రులకు మాత్రమే అబార్షన్ చేయడానికి అనుమతించింది. ఈ నేపథ్యంలో, కరూర్ జిల్లాలో ఉన్న ఓ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చట్టవిరుద్ధంగా అబార్షన్ చేసినందున అనారోగ్యానికి గురైన ఓ మహిళ ఈ నెల 19న విచారణకు రాగా, ఆమె పలు వాస్తవాలను వెల్లడించారు. దీంతో నామక్కల్ జిల్లాకు చెందిన వైద్య పరిశోధన బృందం సర్వే చేపట్టి బెంగళూరుకు చెందిన ధరణీధరన్ సెల్వం అనే డిస్ట్రిబ్యూటర్ సేలం, తేని జిల్లాలో లైసెన్స్ పొందని క్లినిక్‌లకు అబార్షన్ పరికరాలను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది. సెల్వంను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు.

ఉపాధ్యాయ దినోత్సవం



కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మెంబర్లు ఇటీవల పదవీ విరమణ పొందిన టీచర్లు వీఏ.సంపత్, వీఎస్.శాంతి, డి.వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లోకనాథుడు, సభ్యులు కుశల్ చెంద్ మెహతా, విజయ్‌కుమార్, ప్రకాష్, సునీల్‌కుమార్, అయ్యప్ప, జీవేల్, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కారదర్శి ఆస్పత్రిలో చేరిక

అడయార్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం జ్వరం కారణంగా ఆస్పత్రిలో చేరారు. 65 యేళ్ల షణ్ముగం క్షేత్రస్థాయిలో అనేక ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అయితే, గత ఐదు రోజులుగా ఆయన జ్వరంతో బాధపడుతూ వచ్చారు. దీంతో పార్టీతో పాటు ఇతర కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ఇంటిపట్టునే చికిత్స చేయించుకుంటున్నారు. అయినప్పటికీ ఆయనకు జ్వరం తగ్గలేదు. దీంతో ఆయన స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం చేరగా వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షకు పంపించారు. ఫలితాలు వచ్చిన తర్వాత తగిన వైద్యం చేస్తామని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.



4న ఎస్టీఆర్-49 ప్రోమో

కోలీవుడ్‌లో ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న సిలంబరసన్ - వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న చిత్ర ప్రోమోను అక్టోబరు 4న విడుదల చేయనున్నారు. ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను నిర్మాణంలో 'వి' క్రియేషన్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. సింబు - వెట్రిమారన్ - థాను కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది సింబు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తెరకెక్కే ఈ చిత్రం తమిళ చిత్రపరిశ్రమలో ట్రెండ్‌ను సృష్టించడంతోపాటు మైలురాయిగా నిలుస్తుందని భావిస్తు న్నారు. ఈ ప్రోమో కోసం దర్శకుడు వెట్రిమారన్, హీరో సింబు కలిసి పనిచేస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక సాగుతోంది. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్టు నిర్మాతలు తెలిపారు.

← డబ్బింగ్ స్టూడియోలో వెట్రిమారన్, సిలంబరసన్

ఆస్కార్ రేస్‌లో సూర్య కుమార్తె 'డాక్యుమెంటరీ'

చిత్రజ్యోతి

అగ్రహీరో సూర్య - జ్యోతిక కుమార్తె దియా సూర్య రూపొందించిన డాక్యుమెంటరీ ఆస్కార్ అవార్డు కోసం పోటీ పడుతోంది. తమ సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై తెరకెక్కించిన ఈ డాక్యుమెంటరీ బాలీవుడ్ మహిళల జీవితాల ఆధారంగా చేసుకుంది. తెరవెనుక పనిచేసే లైట్ ఉమెన్ అనుభవాలను వివరించే విధంగా రూపొందించారు. 'లీడింగ్ లైట్' అనే పేరు పెట్టారు. హీరో సూర్య - జ్యోతిక నిర్మాతలు. ఈ డాక్యుమెంటరీని ఆస్కార్ పోటీ కోసం అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఈనెల 26వ తేదీన ప్రదర్శించగా, అందరి ప్రశంసలు అందుకున్నట్టు దియా సూర్య వెల్లడించారు.



సూర్య కుమార్తె దియా

పుదువై సీఎం సమక్షంలో దక్షన్ విజయ్ కొత్త చిత్రం ప్రారంభం

దక్షన్ విజయ్ హీరోగా మరో చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి సమక్షంలో తాజాగా జరిగింది. ఇందులో దక్షన్ విజయ్ హీరోగా నటించడంతో పాటు ఈ చిత్రానికి తొలిసారిగా కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలను సమకూర్చుతున్నారు. మగిళ్ ప్రొడక్షన్స్ పతాకంపై సి.బ్యూలా నిర్మించే ఈ చిత్రాన్ని సీయోన్ రాజా డైరెక్ట్ చేస్తున్నారు. ఇందులో తల్లి పాత్ర ఎంతో కీలకమని, ఆ పాత్రను 'కర్ణన్' మూవీలో హీరో ధనుష్ తల్లిగా నటించిన 'వాళై' జానకి పోషిస్తున్నారు. ఇతర పాత్రల్లో విజయ్ టీవీ అముదవాణన్, లొల్లుసభ జీవా, సహిత సుకన్య, విదుష్నియ, గంజా కరుప్పు, ఇమాన్ అన్నాచ్చి తదితరులు నటించారు. విను పెరుమాళ్ కెమెరామెన్‌గా పనిచేసే ఈ చిత్రానికి శ్యామ్ సంగీతం. ఈ మూవీలో హీరో దక్షిన్ విజయ్ సరికొత్త గెటప్‌లో కనిపించనున్నారు. చిత్రీకరణ పనులు పాండిచ్చేరి, దాని చట్టుపక్కల ప్రాంతాల్లో జరుపుకోనుంది.



చిత్ర ప్రారంభోత్సవంలో సీఎం రంగస్వామి, దక్షన్ విజయ్ తదితరులు



'అరువడై'లో కార్తికేశన్

'అరువడై' ఫస్ట్‌లుక్ రిలీజ్

'లారా' చిత్ర నిర్మాత కార్తికేశన్ తాజాగా దర్శకుడిగా అవతారమెత్తి 'అరువడై' రూపొందించడమే కాకుండా హీరోగా కూడా నటిస్తున్నారు. సిమ్రాన్ రాజ్ హీరోయిన్. 'పరుత్తివీరన్' శరవణన్ ప్రధాన పాత్రలో నటించారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. తొలిదశ చిత్రీకరణ కోయంబత్తూరు, గోపిశెట్టిపాళెయం, భవాని, పొల్లాచ్చిల్లో చేస్తున్నారు. పూర్తి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం గ్రామీణులు, వారి జీవితాలల్లో భావోద్వేగాలు, మట్టి, పంటలు ఇత్యాది అంశాలపై ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా ఆనంద్, సంగీతం రఘు శ్రవణ్‌కుమార్ సమకూర్చనున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది.



శ్రీవిల్లిపుత్తూరు ఆలయ వీధుల్లో గోదాదేవి శూడికొడుత్త పుష్పమాలను ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు

శ్రీవిల్లిపుత్తూరు నుంచి తిరుమలకు బయల్దేరిన

గోదాదేవి శూడికొడుత్త పుష్పమాల

టినగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం గరుడోత్సవంలో శ్రీవారికి ధరింపజేసే నిమిత్తం శ్రీవిల్లిపుత్తూరు ఆలయం నుంచి గోదాదేవి శూడికొడ్డు పుష్పమాలతో ఆలయ వైష్ణవపండితులు ఊరేగింపుగా బయలుదేరారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూలో సుప్రసిద్ధ ఆండాళ్ ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారు ధరించిన పుష్పమాలను ఆ ప్రాంగణంలోనే మరో సన్నిధిలో ఉన్న పెరియపెరుమాళ్ (రంగమన్నార్)కు ధరింపజేయడం ఆనవాయితీ. మదురైలో కళ్లలగర్ వైగైనదిలో వేంచేసే సమయంలోనూ శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి శూడికొడుత్త మాలనే ధరిస్తారు. ఇక భూలోక వైకుంఠం శ్రీరంగం చిత్తిరై ఉత్సవాల్లోనూ స్వామివారికి శూడికొడుత్త పుష్పమాల, చిలుక ప్రతిమ, మేలిమి పట్టువస్త్రాలను, చందన తాంబూలాది మంగళకరమైన వస్తువులను సమర్పిస్తుంటారు. యేటా పురటాసి మాసంలో తిరుమల శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ రోజున స్వామివారికి ధరింపజేసేందుకు శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ధరించిన పుష్పమాలను ధరించి భక్తకోటిని అనుగ్రహిస్తారు. ఆ ప్రకారమే శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో శుక్రవారం సాయంత్రం శూడికొడుత్త పుష్పమాలను, చిలుక ప్రతిమను, పట్టువస్త్రాలున్న వెండి బుట్టను ఆలయ ప్రధానార్చకుడు శిరస్సుపై ఉంచుకుని బయలుదేరారు. వైష్ణవపండితులు మంత్రోచ్ఛాటనలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన వీధులలో వాటిని ఊరేగించారు. ఆలయ పట్టపుటేనుగు ముందునడిచి వెళుతుండగా, దాని వెనుకనే శూడికొడుత్త పుష్పమాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు కారులో ఆ వెండిబుట్టతో కారులో తిరుమలకు బయలుదేరారు. ఆదివారం గరుడసేవ రోజును వీటిని తిరుమలేశుడు ధరించి భక్తులను అనుగ్రహించనున్నారు.



సదస్సులో పాల్గొన్న వైద్యప్రముఖులు

గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్ సంరక్షణపై సదస్సు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ సంరక్షణపై నగరంలోని గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో శనివారం సదస్సు జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి 300 మందికి పైగా వైద్య ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కాగా, తమిళనాడు విద్యుత్ బోర్డు అదనపు ప్రధాన కార్యదర్శి, సీఎండీ డాక్టర్ జె.రాధాకృష్ణన్, గ్లెనీగల్స్ హాస్పిటల్ చెన్నై ఆపరేషన్స్ అండ్ మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ బిశ్వరూప్ పాల్, ఆస్పత్రి ఆంకాలజీ విభాగ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ రమణి, ప్రముఖ వైద్యుల నేతృత్వంలో సదస్సు ప్రారంభమైంది. ఆంకాలజిస్టులు, సర్జన్లు, పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఈ సదస్సులో క్యాన్సర్ సంరక్షణలో అత్యాధునిక పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి క్లస్టర్ సీఈవో డాక్టర్ రాగేశ్వరరావు మాట్లాడుతూ.. 'గ్లెన్ ఆన్‌కాన్ 2025' పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో నిపుణులు చర్చించి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు మెరుగైన ఫలితాలుగా మారే అంశాలను పరస్పరం పంచుకుంటారని వివరించారు.

పంటలదిగుబడిలో మనమే ఫస్ట్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే వ్యవసాయ ఉత్పత్తుల అధికంగా పండిస్తున్న రాష్ట్రంగా తమిళనాడు పేరుగడించిందని సీఎం స్టాలిన్ అన్నారు. శనివారం ఉదయం నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన రెండు రోజుల వ్యవసాయ వాణిజ్య ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత నాలుగు సంవత్సరాలుగా డెల్టా జిల్లాల రైతులకు మేట్టూరు డ్యాం జలాలను నిర్దేశిత తేదీల్లోనే విడుదల చేశామని, రైతుల అభిప్రాయాలకు అనుగుణంగానే వ్యవసాయ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వరి దిగుబడి యేటా అధికమవుతూనే ఉందని తెలిపారు. ఈ యేడాది రాష్ట్రంలో 5.66 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వరి పండించామని, ఇది గత యేడాది కంటే లక్ష హెక్టార్లు అధికమన్నారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టిసారించడం వల్లే గత నాలుగేళ్లలో ఆహార ఉత్పత్తులు 456 మెట్రిక్ టన్నులకు పెంచామని తెలిపారు. 47 వేల ఎకరాల బీడుభూములను సాగుకు అనుకూలంగా మార్చామన్నారు. ఇక రైతుల వద్దకే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. పంటల ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా అధికం చేశామన్నారు. నూనె గింజల ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మంత్రులు కేఎన్ నెహ్రూ,ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, రాజకన్నప్పన్, దామో అన్బరసన్, శాసనసభ్యులు ఇ.కరుణానిధి, తమిళరసి, వరలక్ష్మి, కార్తికేయన్, మోహన్, దురై చంద్రశేఖరన్, ప్రభుత్వ కార్యదర్శి దక్షిణామూర్తి,కమిషనర్ అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు

ఘనంగా వీఐటీ ఛాన్సలర్ మనవరాలి వివాహ రిసెప్షన్

- సీఎం దంపతులు సహా ప్రముఖుల హాజరు

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మనవరాలి వివాహ రిసెప్షన్ వేడుకలకు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్, దుర్గా దంపతులతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్-రమణి బాలసుందరం దంపతుల కుమార్తె కాదంబరి... డాక్టర్ ఎ.గోవిందరెడ్డి-మాలిని దంపతుల కుమారుడు డాక్టర్ శ్రావణ్‌కృష్ణ వివాహ రిసెప్షన్ వేడుకలు శుక్రవారం రాత్రి స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్.రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు, డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు కేఎన్.నెహ్రూ, పీకే.శేఖర్‌బాబు, దురైమురుగన్, రఘుపతి, ఎంపీలు ఎస్.జగద్రక్షకన్, దయానిధి మారన్, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, బీజేపీ సీనియర్‌నేత హెచ్.రాజా, కాంగ్రెస్ ప్రముఖులు కేఎస్.అళగిరి, కృష్ణస్వామి, టీఎంసీ అధ్యక్షుడు టీకే.వాసన్, డీఎండీకే నేత సుధీష్, ఎస్ఆర్ఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పారివేందర్, న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు షణ్ముగం, మాజీ మేయర్ సైదై దురైస్వామి, ప్రముఖ నటులు గౌండమణి, నాజర్, శివకార్తికేయన్, సత్యభామ వర్శిటీ ఛాన్సలర్ దీనా జాన్సన్ తదితరులు వధూవరులను ఆశీర్వదించారు. వీరిని వీఐటీ ఛాన్సలర్ జి.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం, ఇతర కుటుంబసభ్యులు సాదరంగా ఆహ్వానించారు.

రెయిన్‌బో ఆస్పత్రిలో 'పీఎఫ్ఐసీ13'



మీడియా సమావేశంలో వైద్య బృందం, చికిత్స పొందిన చిన్నారులు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ 'లైవ్ పీడియాట్రిక్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫర్ ప్రోగ్రెసివ్ ఫ్యామిలియల్ ఇంట్రాహెపాటిక్ కొలస్టాసిస్ టైప్ 13' (పీఎఫ్ఐసీ13) నిర్వహించడం ద్వారా భారత వైద్యచరిత్రలో సరికొత్త మైలురాయిని అధిగమించింది. ఈ ప్రక్రియను ఆస్పత్రిలోని అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పీడియాట్రిక్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌లో తూత్తుకుడికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి నిర్వహించినట్లు ఆస్పత్రి లీడ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్ హెపటాలజిస్ట్ సోమశేఖర్, డాక్టర్ ప్రసన్నగోపాల్, డాక్టర్లు కార్తీక్ నారాయణన్, నటరాజ్ పళనియప్పన్, కీర్తివాసన్ శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తమ బృందం ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు వున్న శిశువులపై రెండు అదనపు అరుదైన పీడియాట్రిక్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్లను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ఇది దేశంలో అధునాతన పీడియాట్రిక్ లివర్ కేర్‌లో అగ్రగామిగా రెయిన్‌బో స్థానాన్ని బలోపేతం చేసిందన్నారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. కాంచీపురం పట్టణంలోని గణేశనగర్‌లో ఉన్న తుంబవనం మారియమ్మన్ ఆలయంలో నవరాత్రి సందర్భంగా శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకం, అనంతరం రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200ల కొత్త కరెన్సీ నోట్లతో అలంకరించగా, మహాలక్ష్మి అవతారంలో కనువిందు చేస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు కాంచీపురం జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తుంబవనం మారియమ్మన్ ఆలయానికి పోటెత్తారు.



కాంచీపురం గణేశనగర్‌లోని మారియమ్మన్‌ను కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం



వేంకటేశ్వరస్వామి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

ప్యారీస్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు వేద పారా యణం, 9గంటలకు కన్యకా పరమేశ్వరి మూల మంత్ర హోమం, 10.30 గంటలకు అభిషేకం, సాయం త్రం 6.30 గంటలకు వేంకటేశ్వరస్వామి అలంకారం, దీపారాధన పూజ లు నిర్వహించారు. చివరగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు జయకృష్ణన్, ఉభయకర్తలు శ్రీని వాసులుశెట్టి, పి.కమలమ్మ, వంశీ, ఆలయ నిర్వాహకులు అనిల్‌కుమార్, హేమంత్, వినోద్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావును శనివారం చెన్నై రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్న సామాజిక సేవకురాలు, విద్యావేత్త డాక్టర్ ఏవీ శివకుమారి, 'పుళల్ కావాంగరై తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్' ప్రతినిధులు జి.మురళి, బి.బాలాజి, పి.హేమాద్రి

మాజీ ఎంపీపై చీటింగ్ కేసు?

అడయార్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సేలంకు చెందిన మాజీ ఎంపీ దేవదాస్ రూ.1.17 కోట్ల మోసం చేసినట్టు విరుదునగర్ జిల్లా రాజపాళెయంకు చెందిన పత్తి వ్యాపారి సుబ్రహ్మణ్య రాజా మరికొందరు వ్యాపారులతో కలిసి సేలం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాజపాళెయంకు చెందిన తాను మరికొందరు స్నేహితులతో కలిసి పత్తి వ్యాపారం చేస్తున్నామనీ, రైతుల నుంచి పత్తిని సేకరించి పత్తి నూలు తయారు చేసే కంపెనీలకు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎంపీ దేవదాస్ కుమారుడుకి చెందిన కంపెనీకి కూడా సరఫరా చేయగా, తొలుత బిల్లులు సక్రమంగా చెల్లిస్తూ వచ్చిన ఆయన ఆ తర్వాత మొహం చాటేశారని పేర్కొన్నారు. తమకు మొత్తం రూ.1.17 కోట్ల మేరకు బకాయిలను చెల్లించాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.



తిరువళ్లూరు జిల్లా మధురవాయల్‌లోని నోలంబూరు వద్ద శుక్రవారం రాత్రి కూవం వాగుపై రూ.31.65 కోట్లతో నిర్మించిన కొత్త ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



శోభాయమానం స్నపన తిరుమజనం




తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం రంగనాయక మండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమజనం శోభాయమానంగా నిర్వహించారు. బాదం, పిస్తా, వట్టివేరు, పసుపు కొమ్ములు, ఎండుద్రాక్షా, యాలకులు, తులసి, రోజామాలలతో పాటు ఈసారి ప్రత్యేకంగా కుంకుమ పువ్వు మాలలు, కిరీటాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని అలంకరించారు.

కాశ్మీర్ కుంకుమపువ్వుతో మాలలు

కాశ్మీర్ నుంచి తీసుకువచ్చిన మూడు కేజీల కుంకుమ పువ్వుతో చెన్నైకు చెందిన నిపుణులు మాలలు, కిరీటాలు తయారు చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు. అలాగే కురువేరు, తామరపువ్వులతో తయారు చేసిన మాలలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నైకు చెందిన రాజేంద్రన్, షణ్ముక సుందరం, బాలసుబ్రహ్మణ్యం గత కొన్నేళ్లుగా ప్రతి స్నపన తిరుమంజనం రోజున ఎనిమిది సెట్ల మాలలు, కిరీటాలను అందిస్తున్నారని గార్డెన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రంగనాయక మండపాన్ని కూడా పలు రకాల పండ్లు, పుష్పాలతో అలంకరించారు. ఇందులో 25 వేల తామరపువ్వులు, 5 వేల కట్ రోజా పువ్వులు ఉన్నాయి.

దేవదేవుడినే పతిగా చేసుకున్న

గోదాదేవి



చిత్రం: జి.గాయత్రీదేవి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతి ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపితే, ధనుర్మాసంలో మాత్రం తిరుప్పావై పఠించి అర్చిస్తారు. ముప్పయి పాశురాల తిరుప్పావై మూలద్రావిడంలో గోదాదేవి గానం చేసిన గీతాలు. శ్రీరంగంలోని పూలతోటలో విష్ణుచిత్తులకు లభించిన కుమార్తె గోదాదేవి. రోజూ పూలు కోసి మాలఅల్లి శ్రీరంగనాథుడికి ఈమె వేసేది. ఆ మాలను ముందుగా తన మెడలో ధరించి బావుందని సంతృప్తి పడిన తర్వాతే స్వామికి అలంకరించేది. ఇది అపచారమని విష్ణుచిత్తుడు భావించినా స్వామి మాత్రం ఆమె మాలతో పాటూ గోదాదేవినీ స్వీకరించాడని చెబుతారు. అందుకే గోదాదేవి పుట్టిన శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ అలంకరించుకున్న పూల మాలను ఏటా తిరుమలకు తీసుకువచ్చి శ్రీనివాసుడికి అలంకరిస్తారు. దేవదేవుడినే పతిగా భావించిన మహా భక్తురాలిగా గోదాదేవిని కొలుస్తారు.

సేవింతురే!

కలియుగ వెంకటేశ్వరుని వాహన సేవల్లో కళా బృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. శనివారంనాటి కల్పవృక్ష వాహన సేవలో కళాకారుల ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. మహారాష్ట్రకు చెందిన 111 మంది కళాకారుల డ్రమ్ము విన్యాసాలు కట్టిపడేశాయి. తెలంగాణా కళాకారుల జానపద నృత్యం, కోయ నృత్యం, ఒడిస్సా కళాకారుల దల్కాయ్, జానపద నృత్యం, గుజరాత్ కళాకారుల దాకలదుడియ, రాజస్థాన్ కళాకారుల దాండియా, ఉత్తరాఖండ్ కళాకారుల చోలియా వంటి ప్రదర్శనలు భక్తజనరంజకంగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, దశావతరాలు, చెక్కభజన, డప్పు నృత్యం, కోలాటం ఆకట్టుకున్నాయి. రాత్రి సర్వభూపాల వాహనసేవలోనూ సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు పరవశించిపోయారు.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి)

సాంస్కృతిక వైభవం



ఎటు చూసినా భక్తజనమే

● ముందురోజే గరుడోత్సవ రద్దీ



ఆక్టోపస్ వద్ద సర్వదర్శన భక్తుల రద్దీ

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గరుడ వాహనం ముందు రోజే రద్దీగా మారింది. పెరటాసి మాసం రెండో శనివారం కూడా తోడవ్వడంతో భక్తసంద్రంగా దర్శనమిస్తోంది. మధ్యాహ్నానికే మాడవీధుల గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మూలవిరాట్టు దర్శనానికి వెళ్లాలంటే 3 కిలోమీటర్ల క్యూలైన్ కనిపిస్తోంది. మరోపక్క వాహనాల ఆంక్షలు అమలవుతున్నాయి. రింగురోడ్డు వరకే అనుమతిస్తున్నారు. ప్రతి వాహనాన్ని పార్కింగ్‌కు తరలిస్తున్నారు. ఆదివారం విధులు నిర్వహించాల్సిన సిబ్బందిని శనివారం రాత్రి నుంచే తీసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ శనివారం రాత్రి తనిఖీలు చేపట్టి విధుల్లోని భద్రతాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.



→ ఆక్టోపస్ భవనం సర్కిల్ నుంచి భక్తులను పీఏసీ5కి తరలింపు

వెంకన్న భక్తులకు వృక్షప్రసాదం



బ్రహ్మోత్సవాల్లో భక్తులకు 'వృక్షప్రసాదం' పేరుతో తులసి మొక్కలను టీటీడీ ఫారెస్టు విభాగం పంపిణీ చేస్తోంది. తమిళనాడులోని తిరుచ్చారాపల్లికి చెందిన తులసిట్రస్టు టీటీడీకి 2.50 లక్షల తులసి మొక్కలను విరాళంగా అందజేసింది. శ్రీవారి దర్శనం, వాహన దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారికి వీటిని రాంభగీచా, జీఎన్సీ, బాలాజీ బస్టాండ్, అక్టోపస్ భవనం సర్కిల్ ప్రాంతాల్లో అందజేస్తున్నారు. రోజుకు 25 వేల చొప్పున ఇప్పటికే 75 వేల మొక్కలను పంచారు.

తిరుమల చేరిన గోదాదేవి మాలలు





గరుడ సేవలో ఆదివారం శ్రీవారికి అలంకరించడానికి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు తిరుమలకు చేరుకున్నాయి. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దగల పెద్దజీయర్ మఠంలో ఈ మాలలకు పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తిరుమాడవీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి ధరింపజేసిన మాలలను గరుడ సేవలో శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు ఈ మాలలు సమర్పిస్తున్నారు. తమిళనాడు దేవదాయశాఖ జాయింట్ సెక్రటరీ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లి పుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాలలో నేడు	ఉదయం: 8-10మధ్య మోహినీ అవతారం రాత్రి: 6.30 నుంచి గరుడసేవ

ఐదు మున్సిపాల్టీలకు మార్గదర్శిగా కార్పొరేషన్

● స్వచ్ఛ సెహర్ జోడి ద్వారా ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న పలు కార్పొరేషన్ల కమిషనర్లు

తిరుపతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదు మున్సిపాల్టీల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తిరుపతి నగరపాలక సంస్థ మార్గదర్శకం వహించనుంది. ఈక్రమంలో శనివారం కుప్పం, మడకశిర, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు మున్సిపాలిటీలు 'స్వచ్ఛ సెహర్ జోడి' కింద నగరపాలక సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. చిన్న మున్సిపాలిటీల్లో పారిశుధ్యంలో మెరుగైన ఫలితాలు సాధించేలా సహకరిస్తామని కమిషనర్ మౌర్య చెప్పారు. 'స్వచ్ఛ సెహర్ జోడి' పథకం కింద అభివృద్ధి చెందిన నగరాలు మరి కొన్నింటిని అభివృద్ధి చేస్తాయన్నారు. తూకివాకం వద్ద చెత్త నిర్వహణ కేంద్రాన్ని కమిషనర్లు పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు నిమిషానికో బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆదివారం గరుడ సేవ సందర్భంగా నిమిషానికో బస్సు నడపనున్నట్లు ప్రజారవాణాధికారి జగదీష్ శనివారం తెలిపారు. చెన్నై, కాంచీపురం, తిరుత్తణి, వేలూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు రెండు రోజుల పాటు బస్సులు రద్దు చేశామన్నారు. ఎలక్ట్రిక్ సహా మొత్తం 425 బస్సులు.. తిరుపతి- తిరుమల మధ్య తిరుగుతాయన్నారు. 3,125ట్రిప్పులతో 2.3లక్షల మందికి ప్రయాణ ఏర్పాట్లు చేశామన్నారు. మామిడికాయల మార్కెట్, చెర్లోపల్లె సమీపంలోని హైవే, దేవలోక్, భారతీయ విద్యాభవన్, కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కాలేజీ గ్రౌండ్ ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆదివారం సాయంత్రం 7గంటలకు తిరుమలలో రాంభగీచ బస్టాండు వద్ద వంద బస్సులు నిల్వ ఉంచుతామన్నారు.

ఐఐటీలో నిర్మాణాలకు రూ.1250 కోట్లు

● మొదటి విడత ఫేజ్ బీ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో రూ.1250 కోట్లతో మొదటి విడత 'ఫేజ్ బీ' నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా 8 ఐఐటీలలో రూ.11 వేలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం ఒడిశాలోని జార్సిగూడ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ పనులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, ఇది భవనాల నిర్మాణమే కాదని, యువత ఉజ్వల భవిష్యత్తు నిర్మాణమన్నారు. మామిడి, టమోటా రైతులకు ఉపయోగపడేలా ఆహార ప్రాసెస్‌రంగంపైనా ఐఐటీ దృష్టి సారించడం వ్యవసాయ రంగానికి శుభపరిణామమన్నారు. ఈ ఫేజ్ బిలో మూడు అకాడమిక్స్ బ్లాక్స్, ఒక మెగా ఇండోర్ ఆడిటోరియం, ఒక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, రెసిడెన్షియల్, స్పోర్ట్స్ విభాగ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఇవి విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ నాయకత్వంలో సమాజానికి ఈ ఐఐటీ పెద్ద ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీడబ్ల్యూడీ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి, చీఫ్ ఇంజనీర్ కం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ రెడ్డి, ఇన్‌ఛార్జి డైరెక్టర్ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ కృష్ణమోహన్, డీన్లు, ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పర్యాటకం'లో జిల్లాకు మరోసారి అవార్డు

● సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాగా తిరుపతిని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండోసారి అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబబు నుంచి అవార్డు అందుకున్నారు. వారసత్వ, ఆధ్యాత్మిక కళలు, కోస్టల్ అగ్రి, స్పేస్ టూరిజం అభివృద్ధికి కలెక్టర్ విశేషమైన కృషి చేశారు. అలాగే ఇంటర్నేషనల్ యోగా డే, కృష్ణవేణి సంగీత నీరాజనం, హర్ గర్ తిరంగా, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సీఎంతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కలెక్టర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రభుత్వం, టూరిజం అథారిటీ, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. కాగా, ఉత్తమ రిసార్ట్‌గా మాంగో రిసార్ట్ శ్రీసిటీ, ఉత్తమ స్టార్ హోటల్‌గా మారస సరోవర్, ఉత్తమ చెఫ్‌గా భారతీరాజా తాజ్ హోటల్, ఉత్తమ టూరిస్టు డెస్టినేషన్ అర్బన్, రూరల్‌కు సంబంధించిన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం(కలెక్టర్) జిల్లా కలెక్టర్, బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు తిరుపతి ఎయిర్‌పోర్టు, బెస్ట్ టూరిజం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(తిరుపతి), ఆర్ట్ అండ్ కల్చర్ కింద శ్రీకాళహస్తికి చెందిన దశరధాచారికి అవార్డులు లభించాయి.

అధికారులూ.. శభాష్

● మహిళా సాధికారత సదస్సు విజయవంతంపై యంత్రాంగానికి స్పీకర్ ప్రశంసలు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. శనివారం అసెంబ్లీ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. సదస్సు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లతో సదస్సును విజయవంతంచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువచ్చారని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదన్నారు.





చెన్నై గొడుగులు వచ్చేశాయ్

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నై గొడుగులు కూడా తిరుమలకు చేరుకున్నాయి. టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్‌జీ వీటిని అందించారు. వరుసగా 21వ సారి శ్రీనివాసునికి గొడుగులను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ప్రశాంతి, కృష్ణమూర్తి వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధిలో చిన్నారికి అస్వస్థత



బాలికను ఎత్తుకుని పరుగులు తీస్తున్న భద్రతాసిబ్బంది

శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శనివారం రాత్రి పదేళ్ల బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. చిన్నజీయర్ మఠానికి సమీపంలోని గ్యాలరీ నుంచి సర్వభూపాల వాహనసేవను వీక్షిస్తున్న క్రమంలో ఆమె మూర్ఛవ్యాధితో కుప్పకూలిపోయింది. నోటి నుంచి రక్తం రావడంతో బాలిక తల్లిదండ్రులు రోదిస్తూ సమీపంలో భద్రతాసిబ్బంది సాయం కోరారు. వారు వెంటనే బాలికను ఎత్తుకుని వాహనం ఎదురుగా పరుగులు తీశారు. భారీ రద్దీ క్రమంలో గేట్లు తాళం వేయడంతో తిరిగి మ్యూజియం వైపునకు వేగంగా వేసుకున్న అక్కడున్న అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛవల్ల నాలుక కొరుక్కోవడంతో నోటి వెంట రక్తం వచ్చిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటుంది.

సర్వభూపాలంపై స్వామివారు

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి జరిగిన సర్వభూపాల వాహనంపై బకాసురవధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి భక్తులను దర్శనమిచ్చారు. గజరాజులు, అశ్వాలు, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల గోష్టి ముందు సాగుతుండగా గోవిందుడు తన వైభవాన్ని చూపారు.

ఘటాటోపంలో వాహనసేవ : ఉదయం ఓ మోస్తరుగా ఎండ కనిపించినప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. రాత్రి వరకు చల్లటిగాలులు వీయగా, రాత్రి 8.45 గంటల సమయంలో కొద్ది సేపు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉత్సవమూర్తులు తడిచిపోకుండా ఘాటాటోపం నీడలో వాహనసేవను నిర్వహించారు. చినుకులు ఆగిపోవడంతో యాదావిధిగా ఘాటాటోపాన్ని తొలగించి వాహనసేవను నిర్వహించారు.